క్లుప్తంగా

అనుమానిత డెంగీ కేసు నమోదు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు–2 సచివాలయ పరిధిలో ఒక అనుమానిత డెంగీ కేసు నమోదైంది. దీంతో వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. గోపాలస్వామి గుడి బజారులో వచ్చిన కేసు పరిసరాల్లో వైద్య సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ డీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ శాంతిప్రియ, ఏఎన్‌ఎం లక్ష్మీ తిరుపతమ్మ, ఆశలు, వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



సిబ్బందితో చర్చిస్తున్న తహసీల్దారు అనిత

కారంచేడు: గ్రామాల్లో నుంచి వచ్చే ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేలా వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది వేగవంతగా పని చేయాల్సి ఉందని ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల విజ్ఞప్తుల కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆమె గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను కూడా పరిశీలించారు.

యోగాతో అద్భుత ఫలితాలు



విద్యార్థులకు యోగా నేర్పుతున్న యోగా గురువు

పర్చూరు (చినగంజాం): యోగాతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని యోగా గురువు కఠాని సత్యం పేర్కొన్నారు. పర్చూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం వేళ గంట పాటు విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దాని వలన విద్యార్థులకు మనసుపై ఒత్తిడి తగ్గి మెదడు చురుకుగా పనిచేస్తుందని వివరించారు. అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగా నిపుణులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమంతరావుకు నివాళులు



హనుమంతరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బలరాం

మార్టూరు: అనారోగ్యంతో మరణించిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అమరనేని (గాయత్రి) హనుమంతరావు మృతదేహానికి చీరాల మాజీ శాసనసభ్యుడు కరణం బలరామ కృష్ణమూర్తి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావుతో గత మూడు దశాబ్దాలుగా తనకు గల సాన్నిహిత్యాన్ని కుటుంబ సభ్యులు స్థానికులతో పంచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తొండెపు ఆదినారాయణ, శాఖమూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై ఇంటింటా సర్వే

బల్లికురవ: గ్రామాల వారీగా నైపుణ్యాలపై ఇంటింటా సర్వేపై సిద్ధం కావాలని స్కిల్ కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో కుసుమ కుమారి మాట్లాడుతూ గ్రామాలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించుకుంటే సర్వేలను సక్రమంగా పూర్తి చేయవచ్చన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

చీరాల టౌన్: మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నియమించారని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం తెలిపారు. బుర్లవారిపాలెం, ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం. పిట్టువారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల గ్రామ పంచాయతీలకు ఈవోఆర్డీ ఎ.రామకృష్ణ. కొత్తపాలెం, విజయనగర్‌కాలనీ గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు. రామకృష్ణాపురం, కావూరివారిపాలెం పంచాయతీలకు సీడీపీవో కె.ఉమా. చీరాలనగర్, సాల్మన్ సెంటర్ గ్రామ పంచాయతీలకు ఎంఈవో పి.సుబ్రమణ్యేశ్వరరావు. గాంధీనగర్, వాడరేవు గ్రామ పంచాయతీలకు ఏవో ఐ.సుమతీలను ప్రత్యేకాధికారులుగా నియమించారని ఎంపీడీవో తెలిపారు.

నిధులు ఫుల్.. నీళ్లు నిల్ !



చీరాల నగర్ గ్రామంలో పనిచేయని షాలో బోరు



ఈపురుపాలెం పద్మనాభునిపేటలో ఇదీ పరిస్థితి..



బుర్లవారిపాలెం రోడ్డులో ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోని షాలో బోరు

- గ్రామాల్లో మూలన చేరి మరమ్మతులకు నోచుకోని వైనం
- తాగునీటి కోసం అల్లాడుతున్న గ్రామాల ప్రజలు
- 150 చేతిపంపుల్లో 60 పనిచేయనివి
- పట్టించుకోని అధికారులు, కూటమి ప్రభుత్వం

చీరాల టౌన్: ఐదేళ్లు సంతోషంగా కడుపునిండా ఆహారం, సురక్షితమైన తాగునీరు, మంచి విద్య, వైద్యంతో ప్రజలు ఆనందంగా కాలం గడిపారు. కాని అబద్ధపు మాటలతో మోసం చేసి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో రోజురోజూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు మొద్దునిద్రను వీడటం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించకపోవడంతో అల్లాడుతున్నారు. ప్రజలకు తాగునీరు అందించే చేతిపంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదు.

ఆరు నెలల నుంచి కటకటే..

వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామానికి 15 వరకు షాలో బోర్లు, ఇతర చేతిపంపులను ఏర్పాటు చేశారు. అయితే మంచినీటి కోసం ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపులు చాలా వరకు మరమ్మత్తులకు గురయ్యాయి. చీరాల మండలంలో ఉన్న 150 చేతిపంపుల్లో 60 పంపులు ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోలేకపోయాయి. ప్రధానంగా చీరాల మండలానికి దూరంగా ఉన్న తీర ప్రాంత గ్రామాలైన దేవినూతల, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం, కీర్తివారిపాలెం, లింగాపురం, నక్కలవారిపాలెం, తోటవారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు, చీరాల పట్టణానికి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్, చీరాల నగర్, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని చేతి పంపులనుంచి మంచి నీరు రావడం కరువైంది. ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వలనే సమస్య మరింత జఠిలంగా మారింది. గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులు చేయటానికి నిధులను ఖర్చు చేస్తారు. అయితే గ్రామాల్లో మంచినీటి చేతిపంపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు, కార్యదర్శులు, సచివాలయాల సెక్రటరీలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

నిధులున్నా.. నీరివ్వని అధికారులు..

దీనితో తాగునీటి కోసం ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధులున్నా నిష్ప్రయోజనం అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు తమను ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. చీరాల మండలానికి సాధారణ నిధులు రూ. 47 లక్షల వరకు ఉన్నాయి. వీటి ద్వారా అభివృద్ధి పనులు, ప్రజలకు మౌలిక వసతులు కల్పన, మరమ్మతులు చేయించవచ్చు. కాని అటు గ్రామ, ఇటు మండల పరిషత్ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. నిధులు ఉన్నా పంచాయతీల్లో బోర్లు, మరమ్మతులను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇకనైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..



గత కొన్ని నెలల నుంచి చేతిపంపులు రిపేర్లకు నోచుకోకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు కావాలంటే 20 లీటర్ల క్యానుకు రూ.10 ఇచ్చి వేరే ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అధికారులు తమలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని షాలో బోర్లను రిపేరు చేయించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి.

–కే లక్ష్మీ, గృహిణి

వినియోగంలోకి తీసుకువస్తాం..

మరమ్మతుల్లో ఉన్న షాలో బోర్లకు రిపేరు చేయించేందుకు సామగ్రి ఒంగోలు నుంచి రావాల్సి ఉంది. గతంలో మెటీరియల్ అందించే వ్యక్తి సక్రమంగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగానే రిపేరులో జాప్యం ఏర్పడుతోంది. మండల పరిషత్ నుంచి నిధులు, తీర్మానం చేయించి త్వరగా మెటీరియల్ తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని అన్ని గ్రామాల్లో రిపేర్లలో ఉన్న చేతిపంపులు, షాలోబోర్లను కొద్దిరోజుల్లో బాగుచేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, చీరాల

రామస్థూపం నిర్మాణానికి భూమిపూజ



రామస్థూపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

వేటపాలెం: మండలంలోని కొత్తపాలెం రోడ్డు గల దత్తసిద్ధి క్షేత్రంలో నూతనంగా నిర్మించనున్న రామస్థూపం నిర్మాణం కోసం కార్తీక సోమవారం రోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దత్తక్షేత్ర కన్వీనర్ ప్రమీలదేవి మాట్లాడుతూ రామస్థూపం మీద భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేసి, స్థూపం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రం కమిటీ అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సున్నా శివప్రసాదరావు, సహాయ కార్యదర్శి కరణం మురళీకృష్ణ, వెంకటప్పయ్య, దోగుపర్తి రాంబాబు, చోడెం శ్రీనివాసరావు, పెనుగండ రాజేశ్వరి, బండ్ల చంద్ర, శిఖకొల్లి చంద్రకళ పాల్గొన్నారు.

ప్రైవేటుకు వంతపాడుతున్న కూటమి ప్రభుత్వం

- 10వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో వారికి మద్దతు తెలిపిన గ్రామస్తులు

వేటపాలెం: విద్య, వైద్యాన్ని ప్రైవేటు పరం చేసి కార్పొరేట్‌కు దాసోహం అయ్యిందని వక్తలు పేర్కొన్నారు. పందిళ్లపల్లిలోని ప్రభుత్వ వైద్యశాల ఉన్న పెంకుటిళ్ల శిథిలావస్థకు చేరిందని దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 10వ రోజుకు చేరుకున్నాయి. గ్రామంలోని పెద్దలు అనేక మంది రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం పలుకుతున్నారు. ఈసందర్భంగా దీక్షలో పాల్గొన్న దేవాంగ సమితి వైస్ ప్రెసిడెంట్ బీరక సురేంద్ర మాట్లాడుతూ 10వ రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో దీక్షలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన విద్య, వైద్యం, ఉపాధిలాంటి మౌలిక వసతులను రాజకీయ నాయకులు విస్మరిస్తూ ప్రైవేటు వ్యక్తులకు వంతపాడేలా వ్యహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కర్న కృష్ణమోహన్, బండారు శ్రీనివాసరావు, గుత్తి గోవర్ధన్, చల్లా జోగేష్, పృథ్వీ మురళీ, సజ్జా కోటనాగేశ్వరరావు, సాదు రాఘవ పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



గొడుగులు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): దాతల సాయం అభినందనీయమని దాతలు పేర్కొన్నారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పర్చూరు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య చేతుల మీదుగా స్థానిక రోటరీ క్లబ్ భవనంలో 10 మంది తోపుడు బళ్ళ వ్యాపారస్తులకు రూ.25 వేలు విలువ కలిగిన పెద్ద గొడుగులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, కోశాధికారి పంబి సదానందరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ..

చినగంజాం: మండలంలోని పెదగంజాం (యానాది కాలనీ) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివేకానంద సేవా సమితి సభ్యుడు పావులూరు శివాజీ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఆయన సోమవారం మొత్తం 23 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెచ్‌ఎం శైలజకుమారి, ఉపాధ్యాయులు బీ సుకన్యలు పాల్గొని శివాజీకి ధన్యవాదాలు తెలిపారు.

మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి



వలపర్లలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



అద్దంకిలో మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు: దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం అబుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంఈవో వస్రాం నాయక్ ఉపాధ్యాయులతో కలిసి అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆయన దేశానికి చేసిన సేవలు గురించి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకి: అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనవని కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామమోహన్‌రావు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సభను ఆంగ్ల అధ్యాపకురాలు షర్మిలారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాలలోని ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ అద్దంకిలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోటరక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అలహరి హరిప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: జాతీయ విద్యా దినోత్సవం, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం ఎస్‌ఆర్‌అండ్‌పిఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైకుంఠపురంలోని వల్లభాపురపు పిచ్చయ్య ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో నోటు పుస్తకాలు, బిస్కెట్స్ ప్యాకెట్లు పంచిపెట్టారు.వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ వాకర్స్ సభ్యుడు దేవకి సుబ్బారావు, మరికొందరు సభ్యుల సహకారంతో రూ. 9,000 విలువ కలిగిన మెటీరియల్‌ను విద్యార్థులకు చిరు సాయం అందించినట్లు చెప్పారు.

అపరాల సాగుతో అదనపు ఆదాయం



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త కామాక్షి

మార్టూరు: పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, మినుము, శనగ తదితర పైర్లు రైతులు సాగు చేసుకోవాలని బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మండలంలోని రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రబీ సీజన్‌లో సాగు చేయనున్న శనగ, మొక్కజొన్న పైర్లలో ఎరువులు, పురుగు మందులు వాడకంపై అవగాహన కల్పించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఉష మాట్లాడుతూ ఇటీవల కొత్తగా అభివృద్ధి చేసిన మినుము ఎన్బీఈజీ–776 రకం యంత్ర కోతకు అనువుగా ఉంటుందని తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఫసల్ బీమా యోజనకు వర్తించే పంటలు ప్రీమియం వివరాలను తెలిపారు. కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో కిరణ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

అద్దంకి: పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలు సాగు చేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకష్ణ సూచించారు. నాగులపాడు, వెంకటాపురం గ్రామాల్లో రైతులకు ఆయన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ అనూష, సీత తదితరులు పాల్గొన్నారు

ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

చీరాల: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 చీరాల డివిజన్ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి ప్రాంతీయ అధ్యక్షుడు సీహెచ్ హరికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 74 ఏళ్లు పూర్తి చేసుకుని 75లో అడుగుపెడుతున్న మేజర్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 అని అన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా యాజమాన్యంతో పోరాడుతున్న ఏకైక యూనియన్ అని కొనియాడారు. అనంతరం చీరాల డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శిగా డి.మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చుక్కా రవిబాబు, ట్రెజరర్‌గా పి.సురేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోపాలరావు, డిస్కమ్ కార్యదర్శి ఎస్.శర్మ, డిస్కమ్ అధ్యక్షుడు, ప్రాంతీయ కార్యదర్శి ఆర్.సంజీవరావు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సురేష్, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎవి ప్రతాప్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

చీరాల డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎండీ మొయిన్

చీరాల: చీరాల డీఎస్పీగా ఎండీ మొయిన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ డివిజనల్ పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. తాను గతంలో చీరాల పరిసర ప్రాంతాలలో వివిధ హోదాల్లో పనిచేసినందున ఇక్కడి విషయాలు తెలుసునని, శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా సబ్ డివిజన్‌లోని పలువురు సీఐలు, ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

అపార్ ఐడీ కోసం ఆధార్ సెంటర్లు

అద్దంకి రూరల్: అపార్ ఐడీ చేయించుకునేందుకు అద్దంకి ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాయపాలెంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో పేరు సవరణ కోసం, టీసీ, పుట్టిన తేది, సర్టిఫికెట్ పొందవచ్చని విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆటో, కారు ఢీ–నలుగురికి గాయాలు

చీరాల: ఆటోను కారు ఢీకొనడంతో నలుగురికి గాయాలైన ఘటన సోమవారం పందిళ్లపల్లి రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. చీరాల ఆదినారాయణపురానికి చెందిన ప్రభంజన మరికొంత మంది ఆటోలో ఒంగోలు వెళ్తున్నారు. పందిళ్లపల్లి వద్ద ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలని నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

డెలివరీ బాయ్‌పై దాడి

చీరాల: డెలివరీ బాయ్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరచారు. ఈఘటన సోమవారం కారంచేడు మండలం స్వర్ణలో జరగగా క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పేరాలకు చెందిన ఎస్.చిన్ను అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆర్డర్లు డెలివరీ ఇచ్చేందుకు సోమవారం స్వర్ణ, కేశవరప్పాడు వెళ్లాడు. స్వర్ణలో ప్రభూజీ అనే వ్యక్తికి డెలివరీ ఇచ్చే క్రమంలో అక్కడకు వెళ్లగా లోపలికి రమ్మని పిలిచారు. లోపలికి రాకూడదు బయటకు రావాలని చెప్పడంతో ఇద్దరికి మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో డెలివరీ బాయ్‌పై అతడితో పాటు మరో ఇద్దరు దాడి చేసి గాయపరిచారు. గాయాలపాలైన అతడిని చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చారు. అయితే కుటుంబ సభ్యులను కూడా లోపలికి రానివ్వకుండా హాస్పిటల్ సిబ్బంది అడ్డుకున్నారన్నారు. అరగంట పాటు వైద్యం అందించలేదని, సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నరని వారు వాపోయారు. మీడియా సిబ్బందిని కూడా లోపలికి అనుమతించలేదు. అనంతరం అవుట్‌పోస్టు పోలీసులు బాధితుడి వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): రేకులు బిగిస్తూ ప్రమాదశాత్తు కిందపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం యువకుడు మృతి చెందాడు. ఎస్సై పట్టాభి వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం కుందుర్తి గ్రామానికి చెందిన గోగులపల్లి సిలార్‌బుడే (32) తాపీ పనులు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గత అక్టోబర్ 22 తేదీన కొమ్మాలపాడు గ్రామంలో దర్గా సెంటర్ వద్ద ఇంటి పైకి ఎక్కి రేకులు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో కాళ్లు చేతులు చచ్చుపడి గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ చనిపోయాడని వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నేడు సూర్యఘర్ యోజనపై అవగాహన

చీరాల అర్బన్: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎన్‌వీఎస్‌ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఈ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఎస్ఈ జి.ఆంజనేయులు, చీరాల ఈఈ జాన్ థామస్ హాజరవుతారన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనతో ప్రతి ఇంటిపై సుమారు 35 శాతం ప్రభుత్వ రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చాన్నారు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బందితో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసే వెండార్స్‌తో వివరిస్తారని, ఆసక్తి ఉన్న విద్యుత్ వినియోగదారులందరూ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణ

యద్దనపూడి: నీటిసంఘాల ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి సోమవారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు తహశీల్దారు రవికుమార్ తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విష్ణు సారథ్యంలో మండలంలోని పూనూరు, యనమదల గ్రామ సచివాలయాల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నోటీసులను అంటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేడు మంగళవారం సాయంత్రం వరకు రెవెన్యూ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. రేపు సాయంత్రంలోపు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

పశువైద్యాధికారి మృతి

యద్దనపూడి: మండల పశువైద్యాధికారి బట్టా సురేష్‌బాబు (43) గుండెపోటుతో అకస్మికంగా మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఆయనకు చాతీలో నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఎనిమిదేళ్లగా మండలంలోని పూనూరు, యద్దనపూడి గ్రామాల్లో పశువైద్యాధికారిగా పనిచేశారు. సురేష్ భార్య శారద కూడా పశువైద్యాధికారిగా పూనూరులో ప్రస్తుతం పనిచేస్తున్నారు. సురేష్ మృతదేహన్ని ఆయన స్వగ్రామంలోని చీరాలలోని జాండ్రపేటకు తరలించారు. సురేష్ మరణవార్త తెలిసిన పరిసర గ్రామాల పశుపోషకులు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

పలు చోట్ల మద్యం సీసాలు స్వాధీనం

చినగంజాం/మార్టూరు: పర్చూరు ప్రొహిబిషన్ అంజ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పర్చూరులో మెరుపు దాడులు నిర్వహించారు. మార్టూరు మండలంలోని జేఎంపీ అగ్రహారంలో 48 మద్యం సీసాలు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా మంగళగిరికి చెందిన ఎస్టీఎఫ్ టీం సభ్యులు మార్టూరు జాతీయ రహదారిపై అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న మరో వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్లు సీఐ భుజంగరావు తెలిపారు. వారి వద్ద నుంచి 112 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

జే.పంగులూరు: ఎక్సైజ్ ఎస్సై హర్షవర్ధన్ రెడ్డి తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో పాలపర్తి ఏడుకొండలు అనే వ్యక్తి దగ్గర 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని నాలుగుపాడులో అడుసుమల్లి ఆంజనేయులు నుంచి 10 బాటిళ్ల స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.